ఈవారం కథ

# 'లవ్ ఆల్'

★ సాయి బ్రహ్మానందం గొర్తి

బొమ్మలు: అక్బర్

**ఇంతకు ముందెప్పుడూ ఆమెను చూసినట్లు లేదు. నల్లగా, కాస్త లావుగా ఉన్న ఆమెను చూడగానే నల్లజాతి స్త్రీ అని తెలుస్తోంది. డోర్ బెల్ మ్రోగితే మా అబ్బాయి స్నేహితులెవరో వచ్చారనుకున్నాను.**

**ఆ వచ్చినామె నన్ను చూడగానే ''హాయ్! మై నేమ్ ఈజ్ బెట్టీ! ఆర్యూ మిస్టర్ బబూ? ఈ వీధిలోనే ఆ చివర్న ఉంటాను'' అంటూ కరచాలనం చేసింది. నా చివరి పేరు బాబు. అమెరికన్లు వాళ్ల యాసలో నన్ను బబూ అని అంటారు.**

**నేను చేయి కలుపుతూ లోపలికి రమ్మనమని చెప్పాను. ఈ కుపర్టినో ఏరియాకి వచ్చి ఆర్నెల్లు అయ్యిందనీ, నాసాలో పని చేస్తున్నాననీ, నిన్ననే నా గురించి తెలిసిందనీ చెప్పింది. కొంతసేపయ్యాక ఆమే అంది.**

**''మీకు స్టీవ్ జకర్మన్ తెలుసా? ఆయనే మీ గురించి చెప్పాడు. మీ అబ్బాయి మంచి టెన్నిస్ ప్లేయరట కదా? నిజానికి నాకు మీతో పని కాదు, మీ అబ్బాయితో.''**

**మా** పెద్దబ్బాయి అభి నిజంగానే మంచి టెన్నిస్ ప్లేయర్. చిన్నప్పటి నుండి వాడికి టెన్నిస్ అంటే పిచ్చి. వాడికి అనేకంటే నాకే ఎక్కువ పిచ్చి అంటే బావుంటుంది. అమలాపురంలో మా పక్కింటి ప్లీడరొకాయన సాయంత్రమయితే చాలు టెన్నిస్‌కి టిప్ టాపుగా తయారయ్యి వెళ్లే వాడు. వాళ్లబ్బాయి నా క్లాసుమేటు. నేను టెన్నిస్ రాకెట్ ముట్టుకుంటే చాలు అది అరిగిపోతుందన్నట్టు వాడు పోజు కొట్టేవాడు. దాంతో ఎప్పటికయినా టెన్నిస్ ఆడాలన్న కోరిక నాలో బలంగా నాటుకుపోయింది. ఈలోగా పిల్లలు ఎదిగి రావడంతో నా కోరిక నా  పిల్లాడిమీద రుద్దాను.



ఆవిడ మాటలకు బదులివ్వకుండా నవ్వి ఊరుకున్నాను. ఆమె నా వంక ఆశ్చర్యంగా చూస్తూ ''మీ అబ్బాయి వింబుల్డన్ జూనియర్స్ నెగ్గాడట కదా? చాలా బాగా ఆడతాడని స్టీవ్ ఒకటే చెప్పాడు'' చివరి వాక్యాలు ఒత్తి పలుకుతూ అంది.

అభికి అయిదో ఏట నుండి టెన్నిస్ నేర్పించాను. చిన్న చిన్న టోర్నమెంటులు నెగ్గుతూ నెమ్మదిగా జూనియర్సులో అయిదో రాంకు సంపాదించుకున్నాడు. ఆ యేడాది వింబుల్డన్ జూనియర్స్ నెగ్గాడు.

''అది ఆరేళ్ల క్రితం సంగతి. ప్రస్తుతం వాడు టెన్నిస్ ఆడడం మానేసాడు'' మెల్లగా చెప్పాను.

''అదేమిటి, ఇప్పుడు టెన్నిస్ ఆడడం లేదా? నేనింకా టెన్నిస్ ప్రో అనుకుంటున్నాను'' మరోసారి విస్తుబోయి చూస్తూ అంది.

వింబుల్డన్ జూనియర్స్ నెగ్గాక టెన్నిస్ ప్రో అవుదామని మావాడూ అనుకున్నాడు. హైస్కూలు ముగించేసి ప్రో అవడానికి రంగమంతా సిద్ధం చేసుకున్నాడు కూడా. కాని ఊహించని అవాంతరాలొచ్చి అసలు టెన్నిస్ వైపే చూడ్డం మానేసాడు. ఇది తలచుకున్నప్పుడల్లా నా మనసు కకావికలమవుతుంది. ఇప్పుడు మా ఇంట్లో ఎవరూ టెన్నిస్ గురించి మాట్లాడరు.

''ఏమయ్యింది? ఎందుకు మానేశాడు? నేనింకా మా అబ్బాయికి నేర్పుతాడేమోనని అడగడానికి వచ్చాను'' ఆమె గొంతులో నిరాశ స్పష్టంగా కనపించింది.

మావాడు ఇప్పుడు టెన్నిస్ పేరెత్తితేనే చికాగ్గా చూస్తాడు. ఎప్పుడైనా పొరబాటున ఎవరైనా ఈ ప్రస్తావన తెస్తే కూడా పెద్ద రాద్ధాంతమే చేస్తాడు. అందుకని వాడెదురుగా మేం టెన్నిస్ గురించి మాట్లాడడం మానేశాము.

బెట్టీకి మలివై అనే పద్నాలుగేళ్ల కొడుకున్నాడనీ, వాడికి కాలిఫోర్నియా జూనియర్స్‌లో సెంటర్ వన్ రాంకింగ్ ఉందనీ, చిన్న చిన్న టోర్నమెంట్లు గెలి

చాడనీ, ఎప్పటికయినా టెన్నిస్ ప్రో అవుదామన్నదే వాడి లక్ష్యమనీ చెప్పింది. అభి గురించి స్టీవే కాకుండా చాలా మంది చెప్పారనీ, మలివైని ప్రో చెయ్యడానికి అభిలాంటి వాడే సరైనవాడనీ ప్రాధేయపడింది.

''మావాడు హైస్కూలు చదువు పూర్తి చెయ్యాలని నా అభిమతం. ప్రస్తుతం వాడు సఫమోర్. ఇంకో రెండేళ్లు ఓపిక పడితే హైస్కూలు చదువవుతుంది. ఈలోగా మీ అబ్బాయిలాంటి వాళ్లతో ఆడి మెలకువలు తెలుసుకుంటే మంచిదని నా అభిప్రాయం. మీరెలాగయినా ఒప్పించండి. ఉత్తినే కాదు. గంటకి ఎంత చార్జి చేస్తే అంతా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. ఫ్లోరిడాలోని నిక్ బొలిట్టోరి అకాడమీలో మావాడు చిన్నప్పుడు నేర్చుకున్నాడు. ఉద్యోగ రీత్యా నేను కాలిఫోర్నియా రావడం వల్ల అది వదలక తప్పలేదు. మీ అబ్బాయిని పరిచయం చెయ్యండి. నేనయినా... అడుగుతాను'' ఆమె బతిమాలుతూ అంది.



అభి నడిగి చెబుతానని ఆమె ఫోన్ నంబరు తీసుకున్నాను. మావాడు ఎందుకు ఆడడం మానేసాడో ఆమె మరోసారి అడిగింది కానీ, నేను చెప్పలేదు. చెప్పడానికి మనసొప్పలేదు. సిగ్గు పడ్డాను. మావాడు ఎలాగూ ఒప్పుకోడని నాకు తెలుసు. మళ్లీ రెండ్రోజుల్లో కాల్ చేస్తానని చెప్పి శలవు తీసుకుంది.

ఆ రాత్రి డిన్నర్ సమయంలో అభి ముందు బెట్టీ ప్రస్తావన తీసుకొచ్చాను. టెన్నిస్ అంటేనే కోపంగా చూసే అభి, ఏ కళనున్నాడో శ్రద్ధగా విన్నాడు. భోజనం అయ్యి కుర్చీ లోంచి లేస్తూ ''గంటకి తొంభై డాలర్లు ఇస్తుందేమో కనుక్కో! నాకు ఎప్పుడు తీరికుంటే అప్పుడే కోచింగ్. అయినా ఆ అబ్బాయి ఆట చూడాలి నేను ...'' అన్నాడు. మేమందరం నిశ్చేష్టులయ్యాం. ఆలస్యం చెయ్యకుండా త్వరగా భోజనం ముగించి బెట్టీకి కాల్ చేశాను.

★★★

ఆ మర్నాడు సాయంత్రం మేమిద్దరం బెట్టీని కలవడానికి టెన్నిస్ క్లబ్బుకి వెళ్లాం. అప్పటికే బెట్టీ, ఆమె కొడుకు మలివై మా కోసం ఎదురుచూస్తున్నారు. పరిచయాలయ్యాక వాళ్లిద్దరూ ఆడడానికని వెళ్లారు. నేనూ, బెట్టీ కోర్టు పక్కనే ఉన్న బెంచీ మీద కూర్చుని కబుర్లలో పడ్డాం. మలివై ఆట చూస్తే ఎనిమిదేళ్ల క్రితం అభి ఆట గుర్తుకొచ్చింది.

''మలివై బాగా ఆడుతున్నాడు. మంచి ఫ్యూచరుంది. మంచి ఫైటే ఇస్తున్నాడు'' అన్నాను.

''నిజమే! కాని అభి టాప్ స్పిన్స్ చాలా పదునుగా ఉన్నాయి. మలివై ఇబ్బంది పడడం గమనిస్తూనే ఉన్నాను'' అంది ఆమె.

నిజానికి పదేళ్ల క్రితంకీ ఇప్పటికీ టెన్నిస్ ఆటలో ఎంతో మార్పు వచ్చేసింది. రాకెట్ల స్పీడూ, పవరూ వల్ల టెన్నిస్ రూపు రేఖలే మారిపోయాయి. అభి సెట్లో సునాయాసంగా 5 –1 స్కోరుకి వెళ్లిపోయాడు. ఆ గేము గెలిస్తే సెట్ నెగ్గినట్లే. కాని సరిగ్గా అప్పటినుండే మలివై

'అభి సెట్లో సునాయాసంగా 5 –1 స్కోరుకి వెళ్లిపోయాడు. ఆ గేము గెలిస్తే సెట్ నెగ్గినట్లే. కాని సరిగ్గా అప్పటినుండే మలివై పుంజుకున్నాడు. పోటా పోటీగా ఆడి గేమూ సునాయాసంగా గెలిచాడు. పాయింటు పోయినప్పుడల్లా అభి కోపంగా అరవడం చూస్తూనే ఉన్నాను. అభికి నిరాశా, కోపమూ పెరిగిపోయాయి. ఆట స్కోరు అయిదు గేముల వద్ద సమానమయ్యేసరికి కోపాన్ని అణుచుకోలేక రాకెట్టుని బలంగా నేలకేసి కొట్టాడు. రెండు ముక్కలయ్యింది. అది చూసి బెట్టీ విస్తుబోయి నాకేసి చూసింది.'

పుంజుకున్నాడు. పోటా పోటీగా ఆడి గేమూ సునాయాసంగా గెలిచాడు. పాయింటు పోయినప్పుడల్లా అభి కోపంగా అరవడం చూస్తూనే ఉన్నాను. అభికి నిరాశా, కోపమూ పెరిగిపోయాయి. ఆట స్కోరు అయిదు గేముల వద్ద సమానమయ్యేసరికి కోపాన్ని అణుచుకోలేక రాకెట్టుని బలంగా నేలకేసి కొట్టాడు. రెండు ముక్కలయ్యింది. అది చూసి బెట్టీ విస్తుబోయి నాకేసి చూసింది.

అభి మలివై చేతిలో సెట్టు ఓడిపోయినా మరో సెట్టు ఆడదామని పోటీకి దిగాడు. అభి మాట తీరూ, కోపమూ చూసి ఆమె కాస్త బిత్తర పోవడం గమనిస్తూనే ఉన్నాను.

''మీ అభికి చాలా మంచి గేముంది. కానీ ఆడేటప్పుడు కోర్టులో నెగటివ్ యాటిట్యూడు మంచిది కాదని అంటారు. ఇదేమయినా టోర్నమెంటు మ్యాచా? ఓడిపోతే ఎందుకంత కసీ, కోపమూ?'' బెట్టీ నాకేసి చూస్తూ అంది. ఏం చెప్పాలో తెలీలేదు. అది ఆడేవాడికే తెలుస్తుంది. బయటనుండి చూసే వాళ్లకి వేరేలా అనిపిస్తుంది. నేనేమీ జవాబివ్వలేదు.

నేను నొచ్చుకున్నాననుకుందో ఏమో బెట్టీ ''నేను మీవాడు బాగా ఆడడం లేదని అనడం లేదు. అలా రాకెట్లు విరక్కొడుతూ ఆడడం మంచిది కాదనిపించి చెప్పానంతే! నేను చాలా మంది ఆటగాళ్లని టీవీలో చూస్తాను. వాళ్లూ అంతే. మరాట్ సఫిన్ అనే రష్యన్ ప్లేయరు తెలుసు కదా! ఎంత మంచి ఆటుందో, అంతకంటే ఎక్కువ కోపం చూపిస్తాడు. కనీసం మ్యాచ్‌కి రెండయినా రాకెట్లు విరుగుతాయి. అది నాకు నచ్చదు. మంచి ఆట కన్నా ప్రవర్తన చాలా ముఖ్యం'' అంది ఆమె. బెట్టీకి మావాడి తీరు నచ్చలేదని అర్థమయ్యింది.

''మొదట్నుండీ మావాడికి ఇదే పెద్ద సమస్య. నిజానికి కోచింగు కన్నా టెన్నిస్ రాకెట్లకే నేను ఎక్కువ ఖర్చు పెట్టాను. ఆట అయ్యాక ఇకనుంచి అలా చేయనంటాడు. కానీ తీరా ఆట మొదలయ్యాక షరా మామూలే! విసిగి, చెప్పడం మానేశాను. వాడంతట వాడే తెలుసుకోవాలి'' సంజాయిషీలా చెప్పాను.

''మిమ్మల్ని ఒక విషయం అడగొచ్చా? మీవాడు ఇంత అద్భుతంగా ఆడుతున్నాడు కదా. మరి ఎందుకు ప్రో లెవెల్లో రాణించలేకపోయాడు? ఎవరయినా స్పోర్ట్స్ సైకియాట్రిస్టుకి చూపించలేకపోయారా?'' ఆమె సూటిగా అంది.

నేను చెయ్యని ప్రయత్నం లేదని నాకు తెలుసు. రాణించలేకపోవడం కాదు. అభిని ఆరేళ్ల క్రితం డోపింగ్ కారణంతో రెండేళ్లు టెన్నిస్ ఆట నుండి బహిష్కరించారు. జరిగినదంతా చెప్పడం ప్రారంభించాను.

''చాలామందికి టెన్నిస్ ప్రో టూర్ నియమాల గురించీ, నిబంధనల గురించీ తెలీదు. మావాడు వింబుల్డన్ జూనియర్స్ నెగ్గాక ప్రో అవుదామని నిర్ణయించుకున్నాడు. మంచి భవిష్యత్తుందని అందరూ కూడా మెచ్చుకున్నారు. మావాడి ఆట చూసి సాంప్రాస్, అగాసీ లాంటి వాళ్లు అమెరికానుండి మరో మంచి ప్లేయర్ రాబోతున్నాడని కితాబిచ్చారు కూడా. పెద్ద పెద్ద టోర్నమెంట్లు ఆడడానికి మావాడి రాంకింగ్ సరిపోక మొదట్లో కొన్ని క్వాలిఫయింగ్ రౌండ్లు ఆడాల్సొచ్చేది. ఆ సమయంలో యూరపు టూరులో రాకెట్లు విరగ్గొట్టడం చూసి ఒకసారి వీణ్ణి మ్యాచ్ నుండి బహిష్కరించారు. ఆ నిరాశలో అమెరికా తిరిగొస్తుండగా వాడికి ఫ్లైటులో ఇంకో యూరోపియన్ ప్లేయరుతో పరిచయమయ్యింది. జెట్

లాగ్ పోవడానికని మావాడికి అతనొక మందు బిళ్లిచ్చాడు. అప్పుడు బాగానే ఉంది. ఆ తరువాత ఫ్రెంచ్ ఓపెన్‌కి వెళ్లే ముందు మెడికల్ టెస్టులు చేయించాలన్నారు. ఆ రిపోర్టుల్లో మావాడి శరీరంలో మిథైల్ హెక్సేన్ యమేనైన్ అనే పదార్థముందని కనుగొని వాణ్ణి రెండేళ్లు బహిష్కరించారు. అంత పెద్ద ప్లేయరు కాదు కాబట్టి బయట ప్రపంచానికి పెద్దగా తెలీదు. ఆ తరువాత అభి డిప్రెషన్‌కి లోనయ్యాడు. దాన్నుండి బయట పడడానికి ఏడాది పైగా పట్టింది. ఆ తరువాత మళ్లీ మావాడు టెన్నిస్ జోలికి పోలేదు'' ఇక మాటలు పెగలక ఆగిపోయాను.

నా గొంతు మారడం ఆమె గమనించి, జాలిపడుతూ, ''ఓ ఇట్స్ ఎ షేం!'' అనంది. మళ్లీ నేనే అన్నాను.

''నాకు తెలుసు. వాడు తెలిసి ఏ తప్పూ చేయలేదని. కానీ చేయని తప్పుకి వాడు శిక్ష అనుభవించాడు. మమ్మల్ని యాంటీ డోపింగ్ వాళ్లకి అభ్యర్థన పెట్టుకోమని చాలామంది సలహా ఇచ్చారు కానీ అప్పటికే మావాడు డిప్రెషన్‌లో ఉన్నాడు. ఆటకన్నా కొడుకు ముఖ్యమని మా ఆవిడ టెన్నిస్ మర్చిపోమంది. గత రెండేళ్లుగా అప్పుడప్పుడు ఆడుతున్నాడు కానీ, మళ్లీ ఆ ఆటా, ఆ పట్టూ రాలేదు. ఇదీ మావాడి వెనకున్న కథ.''

చెబుతుంటే నా కళ్లలో నీళ్లొచ్చాయి.

''సారీ! బబూ! అనవసరంగా మిమ్మల్ని బాధకి గురిచేశాను. క్షమించండి!'' అంటూ నావైపు సానుభూతిగా చూసింది.

ఆటయ్యాక, ''మలివైకి మంచి ఆటుంది. చాలా బాగా ఆడుతున్నాడు. నేను మీవాడితో ఆడతాను. ఆ రకంగా నా గేమూ పాలిష్ అవుతుంది. మీవాడికి మంచి భవిష్యత్తుంది'' అంటూ మలివై భుజం తడుతూ బెట్టీతో అన్నాడు అభి. ప్రతీ శని, ఆదివారాలు కోచింగ్ ఇవ్వడానికి ఒప్పుకున్నాడు.

''నీ వయసేం మించి పోలేదు. నువ్వు కూడా మరోసారి ప్రయత్నించవచ్చు. నాకెందుకో నువ్వు ఈసారి విజయం సాధిస్తావనిపిస్తోంది'' నవ్వుతూ అని, శలవు తీసుకొని వెళ్లిపోయింది బెట్టీ.

అనుకోకుండా పరిచయమైన బెట్టీ మూణ్ణెల్లలో మాకు అతి దగ్గరయ్యింది. మావాడు మలివైకి బాగానే కోచింగిస్తున్నాడు. చూస్తుండగానే మలివై ఆట తీరు మెరుగయ్యి, చిన్న చిన్న ఓపెన్ టోర్నమెంట్లు కూడా గెలిచాడు. ఇది చూసే అభికి మళ్లీ టెన్నిస్ ప్రో కావాలన్న కోరిక బలపడింది. మళ్లీ ఏం జరుగుతుందోనని, నేనూ మా ఆవిడా మాత్రం భయపడ్డాం.

★★★

ఏడాది గడిచిపోయింది.

మలివై పరిచయమయ్యాక అభిలో మునుపటి ఉత్సాహం వచ్చింది. సిలికాన్ వేలీ సైబేస్ ఓపెన్ అని ఒక టోర్నమెంటులో మలివై ప్రీ-క్వాలిఫయింగు రౌండు ఆడడానికి సిద్ధమయ్యాడు. అభిని కూడా ఆడమని బెట్టీయే ప్రోత్సహించింది. మలివై, అభీ ఇద్దరూ క్వాలిఫయింగ్ రౌండ్‌కి వెళ్లారు. ఊహించని విధంగా అక్కడ చివర మ్యాచ్‌లో ఇద్దరికీ పడింది. ఎవరు గెలిస్తే వాళ్లు టోర్నమెంటు మెయిన్ డ్రాలో ఆడతారు.

అభి గెలుస్తాడని నేనూ, బెట్టీ, మలివై ముగ్గురం అనుకున్నాం. కానీ ఆ మ్యాచ్‌లో ఓడిపోతున్నానని తెలిసి అభి కోపంతో రెండు రాకెట్లు విరగ్గొట్టాడు. ఎంపైరు ఫైను వేసి ఒక పెనాల్టీ గేము మలివైకిస్తే దాంతో నెగ్గాడు అతను.

మ్యాచయ్యాక అభి కోపంగా మలివైతో ఇక నుంచి ఆడేది లేదని తిడుతూ అక్కడనుండి వెళ్లిపోయాడు. నేనెంత పిలిచినా వినలేదు. నేను వాళ్లకి సారీ చెప్పి వాణ్ణి అనుసరించాను. అభి ఓటమిని అసలు అంగీకరించలేదు. అందునా తను ఆట నేర్పుతున్నవాడి చేతిలో ఓడిపోవడం అస్సలు జీర్ణించుకోలేక పోయాడు. ఇంటికి వచ్చాక పెద్ద యుద్ధమే జరిగింది. మళ్లీ టెన్నిస్ పేరెత్తితే ఊరుకునేది లేదని మా ఆవిడ నన్ను భయపెట్టింది.

ఆ తరువాత బెట్టీని కలవడానికి మొహం చెల్లక ప్రయత్నించలేదు. బెట్టీ కూడా మమ్మల్ని కలవడానికి ప్రయత్నించలేదు. బెట్టీకి క్షమాపణ చెబుదామని అనుకున్నాను కానీ ఆఫీసు పని మీద ఓ నాలుగు వారాలు జపాన్ వెళ్లాల్సొచ్చి కలవలేకపోయాను.



చూస్తుండగానే రెండు నెలలు గడిచిపోయాయి. ఓ రోజు అకస్మాత్తుగా బెట్టీ నుండి ఒక ఉత్తరం వచ్చింది. ఏమిటాని విప్పి చూస్తే, అందులో అభి పేర నాలుగొందల డాలర్ల చెక్కుంది. చివర్లో మలివైకి ఆట నేర్పినందుకు కృతజ్ఞతలని ముక్తసరిగా మూడు మాటలు రాసిందంతే!

వెంటనే బెట్టీకి ఫోన్ చేశాను. ఎవరూ ఎత్తలేదు. ఆమె పంపిన చెక్కు తిరిగిచ్చేద్దామని రెండ్రోజుల తరువాత బెట్టీ ఇంటికి వెళ్లాను. ఎవరూ ఇంట్లో ఉన్నట్లు కనిపించలేదు. వెనక్కొచ్చేస్తుండగా స్టీవ్ కనిపించాడు. బెట్టీ వాళ్లు వారం క్రితమే ఫ్లోరిడా వెళ్లిపోయారని చెప్పాడు. ఆమె అడ్రసు అడిగితే తెలీదన్నాడు.

★★★

''నాకు తెలుసు. వాడు తెలిసి ఏ తప్పూ చేయలేదని. కానీ చేయని తప్పుకి వాడు శిక్ష అనుభవించాడు. మమ్మల్ని యాంటీ డోపింగ్ వాళ్లకి అభ్యర్థన పెట్టుకోమని చాలామంది సలహా ఇచ్చారు కానీ అప్పటికే మావాడు డిప్రెషన్‌లో ఉన్నాడు. ఆటకన్నా కొడుకు ముఖ్యమని మా ఆవిడ టెన్నిస్ మర్చిపోమంది. గత రెండేళ్లుగా అప్పుడప్పుడు ఆడుతున్నాడు కానీ, మళ్లీ ఆ ఆటా, ఆ పట్టూ రాలేదు. ఇదీ మావాడి వెనకున్న కథ.''

ఏడాది తరువాత ఫ్రెంచ్ ఓపెన్ జూనియర్స్ ఫైనల్లో మలివై ఓడిపోయాడని ఇంటర్నెట్‌లో చదివాను. బెట్టీ వాళ్లు ఎక్కడున్నారో మాత్రం తెలీలేదు.

అభి కాలేజీ సీనియర్‌గా ఉండగా వాడికి శాంతాక్లారా యూనివర్సిటీలో జూలియా పరిచయమయ్యింది. వాళ్లిద్దరూ డేటింగ్ చేస్తున్నారని తెలిసింది. చూడ్డానికి అమెరికన్ అయినా చాలా సంప్రదాయ బద్ధంగా పెరిగిన అమ్మాయిలా కనిపించింది తను. జూలియా కుటుంబం చాలా ఆప్యాయంగా ఉంటారు. జూలియా అక్క పెళ్లి కరేబియన్ ఐలెండ్సులో జరుగుతోందని, మా కుటుంబమంతా వచ్చి తీరాలని జూలియా తల్లిదండ్రులు పట్టుబట్టడంతో మేమూ బయల్దేరాం.

పెళ్లి సెయింట్ విన్సెంట్ దీవిలో అని చెప్పారు. నేనూ, మా ఆవిడా పెళ్లయిన మర్నాడే వచ్చేద్దామని ప్లాన్ చేశాం. అభి ఓ రెండ్రోజుల తరువాత వస్తానని చెప్పాడు.

కరేబియన్ దీవులు చాలా అందంగా ఉన్నాయి. మాకు ఒక హోటల్లో బస ఏర్పాటు చేశారు. అక్కడ అనుకోకుండా బెట్టీ తారసప

డింది. నన్ను చూడగానే గుర్తుపట్టి పలకరించింది. నేనూ బెట్టీని చూసి చాలా సంతోషించాను. ఆమె కూడా మాలాగ ఆ దీవులు చూడ్డానికి వచ్చిందనుకొని అదే అడిగాను.

''నో! చూడ్డానికి రాలేదు. మేం ఇక్కడే ఉంటాం. మా కుటుంబమంతా ఇక్కడే ఉంది'' నవ్వుతూ అంది. తన పూర్వీకులు కరేబియన్ ఐలెండ్సు నుండొచ్చారని ఇంతకు ముందొకసారి చెప్పిన విషయం గుర్తొచ్చింది. వాళ్లాయన విన్సెంట్‌కి ఒంట్లో బాగోలేకపోవడం వల్ల నాసాలో ఉద్యోగం వదిలేసి వచ్చాడని చెప్పింది.

గతాన్ని మర్చిపోయి నన్ను పలకరించినందుకు చాలా సంతోషించాను. నా వలనా, మావాడి వలనా ఏదైనా తప్పు జరిగితే క్షమించమని ఒకటికి పదిసార్లు అడిగాను. అదంతా ఎప్పుడో మర్చిపోయాననీ, మళ్లీ ఇలా కలుస్తామని అనుకోలేదని ఆనందంగా చెప్పింది. వాళ్లింటికి డిన్నర్‌కి రమ్మని ఆహ్వానించింది. కానీ ఆ రోజే మా ప్రయాణం ఉండడం వల్ల రాలేనని చెప్పాను. అభిని కూడా ఎంతో ఆప్యాయంగా పలకరించింది. అభి వల్లే మలివైకి ఎంతో ప్రోత్సాహం లభించిందని, అతనూ టెన్నిస్ ప్రో అవుతున్నాడని చెప్పింది. అభిని కూడా మళ్లీ ప్రయత్నించమని, తప్పకుండా ఈసారి మంచి ఫలితం వస్తుందని చెప్పింది.

వెళుతుండగా బెట్టీ వెనక్కి పిలిచి ''ఈ సెయింట్ విన్సెంట్ దీవిలో ఒక పురాతన చర్చి ఉంది. అక్కడ కొవ్వొత్తి వెలిగిస్తే అనుకున్నవి జరుగుతాయని ఇక్కడివాళ్లు నమ్ముతారు. అభిని ఒకసారి ...'' అని అడిగింది.

నేను నవ్వేశాను. వాడు గుడికే వెళ్లడు. బెట్టీ ఫోను నెంబరు తీసుకొని కాలిఫోర్నియా తిరిగొచ్చేశాను.

★★★

వారం తరువాత అభి తిరిగొచ్చాడు. బెట్టీ ఇంటికి డిన్నర్‌కి వెళ్లానని మాత్రం చెప్పాడు. కరేబియన్ నుండి వచ్చాక, అభిలో ఏదో తెలియని మార్పు కనిపించింది. ఇదివరకటి హుషారు తగ్గింది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఉంటున్నాడు. జూలియాకీ, వాడికీ మధ్య ఏదైనా వచ్చిందేమో అనుకుని ఊరుకున్నాను.

నెల తరువాత ఒక రోజు మాంటరే ఓపెన్ నెగ్గానంటూ ట్రోఫీతో వచ్చాడు. మాకెవరికీ తెలీకుండా రహస్యంగా ప్రాక్టీసు చేశానని చెప్పాడు. అభికి మళ్లీ టెన్నిస్ ఆటమీద మక్కువ కలిగినందుకు ఆశ్చర్యపోయాను. మా ఆవిడా నమ్మలేదు. ఎప్పుడైనా ఓడిపోతే మళ్లీ డిప్రెషన్‌లోకి వెళ్లిపోతాడని తల్లిగా ఆమె భయం ఆమెది.

ఆ టోర్నమెంటు గెలిచాక అభి ప్రవర్తనలో చాలా మార్పు గమనించాను. ఓడిపోతుంటే రాకెట్లు విరగ్గొట్టడం వంటివి మానేశాడు. ప్రతీదీ చాలా పాజిటివ్‌గా చూస్తున్నాడని తెలిసి చాలా సంతోషించాను. జూలియా పరిచయం ప్రభావమని అనుకున్నాను. ఏమయితేనేం అభిలో మంచి మార్పొచ్చింది.

''టెన్నిస్ రాకెట్లు ఎలా తయారుచేస్తారో చూద్దామని ఫ్యాక్టరీ అంతా తిరిగాం. బయటకొస్తూ అభి వెక్కి వెక్కి ఏడ్చాడు. విల్సన్ కంపెనీ వాళ్లు స్పాన్సర్‌షిప్ ఇవ్వలేదన్న బాధతో ఏడుస్తున్నాడని అనుకున్నాను. లేదా తను టెన్నిసులో విఫలమవుతున్నందుకా అనుకున్నాను. ఎంత బతిమాలినా చెప్పలేదు. గట్టిగా అడిగితే చివరికి చెప్పాడు. అతను చెప్పింది విని ఆశ్చర్యపోయాను నేను.''



మెల్లమెల్లగా ఆ ఏడాది అమెరికాలో రెండు చాలెంజరు టోర్నమెంట్లు గెలిచాడు. ఆ విషయం బెట్టీకి ఈమెయిల్లో చెప్పాను. ఆమె అభి కోసం చర్చిలో కొవ్వొత్తి వెలిగించినప్పటి నుండి అభి ప్రవర్తనలోనూ, ఆటతీరులోనూ మార్పొచ్చిందని కృతజ్ఞతలు చెబుతూ ఓ గ్రీటింగ్ కార్డు పోస్టు చేశాను. వారం తరువాత బెట్టీ నుండి నాకు కంగ్రాచ్యులేషన్స్ కార్డూ, దానితో పాటు ఒక చిన్న ఉత్తరం వచ్చాయి.

డియర్ బబూ,

మీ గ్రీటింగ్స్‌కి కృతజ్ఞతలు. అభిలో వచ్చిన మార్పు విని నేనూ సంతోషించాను. అభి తప్పకుండా టెన్నిసులో రాణిస్తాడని, మంచి పేరు తెచ్చుకుంటాడని నాకు ఎప్పుడూ నమ్మకముంది. అభిలో మార్పు రావడానికి కారణం ఒక దేవాలయమే! కానీ అది మీరనుకున్నట్లుగా సెయింట్ విన్సెంట్ చర్చి కాదు. ఈ సెయింట్ విన్సెంటులోనే విల్సన్ వాళ్ల టెన్నిస్ ఫ్యాక్టరీ ఒకటుంది. మలివైకి వాళ్ల స్పాన్సర్షిప్పే వచ్చింది. వాళ్లని అభికి కూడా పరిచయం చేద్దామని అభిని ఆ ఫ్యాక్టరీకి తీసుకెళ్లాను. రాంకింగు వందలోపు వచ్చే వరకూ అభికి స్పాన్సర్‌షిప్ ఇవ్వలేమని చెప్పారు వాళ్లు.



ఆ తర్వాత అక్కడ టెన్నిస్ రాకెట్లు ఎలా తయారుచేస్తారో చూద్దామని ఫ్యాక్టరీ అంతా తిరిగాం. బయటకొస్తూ అభి వెక్కి వెక్కి ఏడ్చాడు. విల్సన్ కంపెనీ వాళ్లు స్పాన్సర్‌షిప్ ఇవ్వలేదన్న బాధతో ఏడుస్తున్నాడని అనుకున్నాను. లేదా తను టెన్నిసులో విఫలమవుతున్నందుకా అనుకున్నాను. ఎంత బతిమాలినా చెప్పలేదు. గట్టిగా అడిగితే చివరికి చెప్పాడు. అతను చెప్పింది విని ఆశ్చర్యపోయాను నేను.

'ఇన్నాళ్లూ టెన్నిస్ రాకెట్లన్నీ మెషినుతో తయారు చేస్తారని అనుకున్నాననీ, కానీ అవన్నీ ఎంతో కష్టపడి చేత్తో తయారు చేస్తారని తెలిశాక తనెంత మూర్ఖంగా ప్రవర్తించిందీ అర్థమైందని బాధపడ్డాడు. ఎంతో కష్టపడితే కానీ రాకెట్టు తయారు కాదనీ, ఒక్కోటీ తయారు కావడానికి పది గంటలు పైగా పడుతుందనీ, అటువంటిది నిమిషంలో ఒక చిన్న పాయింటు రాలేదని విరక్కొట్టడం గుర్తొచ్చి బాధ కలిగిందనీ చెప్పాడు. వచ్చేస్తుండగా అదే ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఒక వికలాంగుడు తను స్వయంగా చేసిన రాకెట్టు అభికిచ్చాడు. బహుశా అదే అభికి ఆత్మ విశ్వాసం కలిగించి ఉంటుందని నా నమ్మకం.

అభి, మలివై ఇద్దరూ వింబుల్డన్ ఫైనల్ ఆడితే మనమందరం కలిసి చూడాలన్నదే నా కోరిక. ఎవరు గెలిచినా విజయం మనదే! అదే జరిగితే ఎవరు నెగ్గుతారో చెప్పలేను కానీ రాకెట్లు మాత్రం విరగవని ఖచ్చితంగా చెప్పగలను. ఏమంటారు?

శుభాభినందనలతో – బెట్టీ విన్సెంట్

చదవడం పూర్తయ్యాక కళ్లు మూసుకున్నాను. వింబుల్డన్ సెంటరు కోర్టులో ఉన్న ఫీలింగ్ కలిగింది.

..........................................

రచయిత ఈమెయిల్ :
gorthib@yahoo.com